# మార్పు

అల్లం రాజయ్య

సాకల్ది ఊరుదిరిగిపోయింది- మునిమాపు తిరిగిపోయింది- చంద్రుడు చింత కేలాడ దీసినట్టుగున్నాడు చిమ్మెట్లు ఉండీఉండీ పలుకుతున్నాయి- సన్నగా పైరగాలి తోలుతున్నది.

వాకిట్లో ఇద్దరువియ్యంకులు పండుకొన్నారు- పిల్ల ఏదోఆటపాట పాడిపాడి నిదురబోయింది.

“అయితే బావా! గట్లయ్యిందన్నమాట- ఏమైన దురుజెట్ట కాలమచ్చింది- కాదంటవా? సాంబయ్య తుపుక్కున మంచంకిందఊంచి గంగయ్యవేపు తిరిగిండు.

మంచంలో పక్కగోలుగా పండుకొని సుట్టతాక్కుంట ఎర్రగా మెరుస్తున్న సుట్టకొరుకునే సూస్తున్న గంగయ్య మాట్లాడలేదు- నిజానికి అతని మనుసు ఇక్కడ లేదు. పట్నపుబజార్లలో- అక్కడినుండి సబ్ జైల్లోని కొడుకుమీదున్నది.

“మనకెందుకు బావా! ఆవులావులు పోట్లాడ్తె లేగలకాళ్ళిరిగినట్టు- అచ్చేటిది రాకమానదు. ఎనుకటినుంచచ్చె ఇలవరిసె గిప్పుడు ఒక్కపెట్టున మార్తదా? సంక లేవడితె ఖార్జం కండ్లబడ్తది- దొరలంటె కొండలసొంటోల్లు- దున్నపోతు గట్టుతోని పోట్లాటబెట్టుకున్నట్టు- డబ్బు, ఇజ్జె, ఖానూన్లు, కచ్చీర్లు మంది మార్బలం గలిగినోల్లు- గాళ్ళతోని ఇరోధం బెట్టుకుంటె మన బతుకేమయిద్ది? ఆకుకుఅందకుంట పోకకు పొందకుంటయిపోద్ది- నాకైతే ఎటుసూసిన గిందట్ల ఫాయిదా కనిపిత్తలేదు- అల్లుడంటె జెరఉచ్చిలి మనిషి- నువ్వన్నజెర బుద్దిగానెం సెప్పద్దా? గౌరవ్వ ఏడ్సేడ్సి సగమైతంది- ఏంభాగ్గెమచ్చె-” సాంబయ్య ఇలాగా ఏదో చెప్పుతూనే ఉన్నాడు.

అయినా గంగయ్య మాట్లాడలేదు- అతని మనుసులో ఎన్నెన్నో విషయాలు కలివిడిగా, విడివిడిగా తిరుగుతున్నాయి. చుట్ట నేలమీదరాసి ఆర్పి మంచంలో లేచి కూర్చున్నాడు. పందిరి గుంజకు అతుక్కపోయి కోడలు గౌరమ్మ నిలబడున్నది- చింతమీద చంద్రుడు పాండురోగం సోకిన వానితీరుగా వెలుగుతున్నాడు- ఆ వెలుతురులో గౌరమ్మ సగం మాత్రమే కనిపిస్తోంది- మిగతాసగం పందిరికింది నీడలో కలిసిపోయింది.

గుడిసెలోపల గౌరమ్మతల్లి లచ్చిమి గుడ్డిదీపం వెలుతురులో మాడిసెక్కలు కాళ్లబారజాపుకొని తింటున్నది.

"గౌరవ్వా గిన్నన్ని మంచినీళ్లు దేవే" అన్నాడు గంగయ్య.

గౌరమ్మ ఇత్తడిచెంబుతో మంచినీళ్లతెచ్చి మామకిచ్చింది— నీళ్లు గటగటతాగి చెంబు కోడలుచేతికిస్తూ కోడలు కళ్లల్లోకి చూశాడు గంగయ్య.

గౌరమ్మ కళ్లల్లో తడి....

గంగయ్య తలపునుక్కున్నాడు— రెండుచేతులతో తలనొక్కుకుంటూ కాసేపు నేలచూపులు చూశాడు.

మనసు సుమ్మర్లు చుట్టుకపోతున్నది— "ఎప్పుడత్తదో కొడుకు— వచ్చినా మళ్ళ తకురారులాదని గ్యారంటేంది? అగ్గిరాజుకున్నంక మంటుండకుండపోద్దా? ఊరినిండా పోలీసోల్లు దిగిండ్లు— మాములుగ బతకడమే గగనమైపోయింది— సన్నుముట్టుకోకు నామాలకాకన్నా ఊళ్లెజరిగేతంతు జరుగకపోదు— పోలీసోనిదుడ్డుకు గరీబోల్లంత ఒక్కటే నాకేజీకరులేదనోడే అలుకగ దొరుకుతడు— కొడుకు కొండయ్య జేసింది తప్పని కండ్లార సూసుకుంటనే ఎట్లంటడు— అసలు మంచిపనేసేసిండని తనకుతెలుసు— తన గుండెకుతెలుసు— ఊళ్లోల్లందరికీ ఎరికే— కనిగిల్లకెట్లజెప్పాలె?"

"పేతులుకాలి బొగ్గలచ్చినంక ఆకులుబట్టుకొనేంభాగ్గెం" లచ్చిమి కంచం కడుగుతూ అన్నది.

"ఆకులేలేంది ఏంజేత్తమేఅవ్వ? ఒడ్డుమీన నిలుసుండి పొలంల బురద గురించి మంచిపెద్దలు పెప్పచ్చు— మరి బురదలకు దిగందే బువ్వలేదే?" గౌరమ్మ విలదీసింది.

"నీకూ అచ్చినాదిరేషం! నువ్వా అయింటి కోడలువేనైతివి— మాసాలు సంబుడం— సూడవోతే—" ఎందుకనో మాటలుపూర్తిచేయకుండానే లచ్చిమి గునిసింది.

"నాకైతె పాడుఎవారం తీర్గనే గన్పడ్తందిబావా! ఎద్దుముడ్డి పొడుసుక బతికె టోల్లం మనం— మనకు సంఘాలెందుకు? గింగాలెందుకు— ఎనుకటినుంచి మన తాతలు తండ్రిలు బతుకలేదా? మనం బతుకుతలేమా? రేపు నీకొడుకు బతకడా? గిప్పుడు గుడ్డచ్చి పిల్లనెక్కిరిచ్చినట్టు ఆడుదొరగాదు దొంగంటె ఆడుదొర కాకుంట పోతడా? బావా మనసేతుల్లేమున్నది— అంత బమ్మరాసినరాత— అని అదురుట్టం గట్లున్నది— ఆడు నోసిపుట్టుకున్నడు— ఆనిప్పున్నెం మంచిది— ఆనికి తాతలు తండ్రిలు బూములు సంపాయించి యిచ్చిండ్లు"

"మాబతుకుతన్నం కుక్కబతుకులు- సచ్చిన మీయవ్వ గిట్లసాన కతలు సెప్పేది...." గౌరమ్మ తండ్రికి ఓమాట తగిలేసింది.

"ఏడువ బిడ్డా! ఏడువు! నీకే గల్లుంటె మజ్జెన నాదేంబోయింది- కడుపు నొచ్చినోడు ఓమ బుక్కుతడు- ఏడువుబిడ్డా! ఏడువు మజ్జెన నాదేంబోయింది" సాంబయ్య ముఖం ముడుచుకున్నాడు.

"ఇంతకూ నువ్వనేదేందిర సాంబా!" గంగయ్య సూటిగాచూస్తూ అన్నాడు.

"ఏమంటడూ! దొరలతోని ఇరోధం పెట్టుకోవద్దంటడు- దొరలు సత్తెనాశిడం జేసిన మన అనువం అని మూలకు కూకుండుమంటడు- తన తీర్గనే బిడ్డపెండ్లికి అయిదు నూర్లప్పుదెచ్చి ఏలుముద్దరేసచ్చి- అయి పెరిగి పెరిగి ఎకురం పెరడి తినికూసుంటె కర్మమని కాల్రిక్కలు మలుసుక పండుమంటడు-" గౌరమ్మ.

మజ్జెన నిన్నేవడు మాట్లాడుమన్నడే!" అంతెత్తు లేసిండు సాంబయ్య.

"కట్టమో సుకమో మేం గట్లబతుకుతన్నం- నిన్నేవడు సాకునాలు జెప్పు మన్నడు మజ్జెన-" గౌరమ్మ పోట్లాటకు దిగింది.

"పిల్లకాక్కేమెరుక ఉండేలదెబ్బ- పోరీ! పుర్రెల పురుగ్గిన మెసులుతందా?" లచ్చిమి కీకలేసింది.

"ఔరసాంబ! దొర మాదండోడు అనికి ఎదురాడద్దు- ఆడు కొట్టినా తిట్టినా, భూములు గుంజుకున్నా! కూల్లెగబెట్టిన- దండుగబుతిన్నా! ఆడోల్ల ఖరాబుసేసినా! ఆని ఇట్టారాజ్జెం సత్తెనాశిడం జేసిన సచ్చినట్టు పడుంకాలెననె గదర నీ మాటలకర్థం- పడుంటె మంచిదే- సచ్చినపాము కసొంటిది రేషమత్తది- కని పడుండనోల్ల గురించి నువ్వూనేను నెత్తినోరు కొట్టుకుంటె ఆగుతరా? సేనుపండి పంటసేతికచ్చేయాల్లకు రాళ్లవాన గొట్టద్దనుకుంటం- దానికాలమత్తె ఆగుద్దా? ఎండకాలం రాకపోతే మంచి గుండనుకుంటం రాకమానుతదా! ఎండకాలమత్తది- సెట్ల అకులు రాలిపోతయి- మళ్ల ఆసకాలమత్తది- కొత్త సిగురులు పుట్టుకత్తయ్-" గంగయ్య ఏదో ఆలోచిస్తున్న వానిలాగా కాసేపాగిండు.

"కట్టాలు తెచ్చుకోవద్దన్నది మంచిమాటే- మనది కట్టపుటుక- గౌరవ్వా పుంజులు గుయ్యంగ లేసిపోదాం- రెండామెడ నడువాలె- కూసంత కూరుకుదియ్యిపో- నువ్వెందుకు ఫికరుపడుతవవ్వా!" అని వియ్యంకుడి ముడుచుకున్న ముఖం చూసి చిన్నగా నవ్విండు.

"ఈపారి మీ అల్లుడు ఇంటికచ్చినంక మీదగ్గరికేతోలిత్త అత్తమామ గలిసి ఆనికె సెప్పవల్సిందేదో చెప్పుండ్రి" గంగయ్య.

"ఆఁ ! అసలు ఆకుక్కబోతే తాలు ఎదురెక్కచ్చిందట- కనిపెంచిన అవ్వయ్యే సంబురపత్తాంటె మజ్జెన మాకేమచ్చె...." లచ్చిమి మెటికలిరిసింది.

"అప్పటి నుంచి సూత్తన్న ఇద్దరూ ఒకటే ఇదయిపోతండ్లు ఇంతకూ ఆడు సేసిన నేరమేందోంట ?"

"అంగి బతుక నిలబడిబతుకుత ననటం-" గౌరమ్మ.

"మీరు గోదాల్లె కొట్టుకపోతమంటె మజ్జెన మాకేంది కడుపునొప్పి-" సాంబయ్య కంఠంలో తీవ్రత ఉన్నది.

"ఏదో అగ్గానెంపోరి దానితోనేంది- నేనోకత సెప్పుతినర సాంబా !" గంగయ్య.

కతలకేమచ్చె- కొడుకు బోయిండని సిన్న మెత్తురంత లేదు మనిషికి-" సాంబయ్య గొనిగిండు.

"ఛత్ సెప్పులుగోసిన కుక్కోలె కొడుకో ! కొడుకు.... అనికేమయ్యిందిరా ! ముందు గీ కతిను.... నాకా నిదురచ్చేటట్టులేదు.... సేనచ్చిన పనిగాలేదు-" గంగయ్య మాట జారిన్నని నాలిక కొరుక్కున్నడు....

"అచ్చిన పనింకేంది బావా ?" సాంబయ్య....

"గదేరా ! గీకత నీకెప్పటినుంచో సెప్పాల్ననుకున్న...." గంగయ్య మాట మార్చిండు.

"మామా నేనింట నాకుజెప్పే...." మంచాల పిల్లకు ఎప్పుడు తెలివి బడ్డదో ఉరుకచ్చి గంగయ్య తొడలమీద కూర్చున్నది.

వెన్నెల వెండిరేకుల్లా పరుచుకొంది- ఎక్కడో ఎవరిదొడ్డిలోనో ఆవు అదేపనిగా దాని మెడలోని బొనుగ ఊపుతోంది- గంగయ్య కథ గునాయించుకుంటున్న వాని లాగా కాసేపు మవునంగా ఉన్నాడు- ఆతరువాత ఉమ్మేసి చుట్టూఉన్న వాళ్లనందరినిచూశాడు. సాంబయ్య, లచ్చిమి, గౌరమ్మ వినేందుకు సిద్ధంగా వున్నట్టుగమనించి సరాయించి గంగయ్య కథ మొదలుపెట్టాడు.

"దచ్చన్న రాజ్జాన ఓ ఊరట...." గంగయ్య కంఠం కొంచెం సవరించి, పాట తీరుగా చెప్పడం సాగించాడు.

"ఊరంటె ఊరుగాదు- కూసంత పెద్దారేనట- గ ఊళ్లె సాకలి, మంగలి, మన్నె, మస్కూరు, మాదిగ, అడ్ల, కమ్మరి, కుమ్మరి, గొల్లకాపు గిట్ల సబ్బండ వర్నాలు బతుకుతున్నరట- అగోగసొంటి ఊరికి ఉత్తురాన పెద్దపెరవు, పెరువు కొమ్ముకు ఊడలమర్రి ఉన్నయ్- మళ్లింక దచ్చినాన సిన్నఏరు, ఏటి ఒడ్డున మద్ది పెల్లు, మద్దిసెల్ల కీతల తాళ్లతోపు- మరి తూరుపుకు తుమ్మల బీళ్లు, తుమ్మల బీళ్లు దాటితె నల్లరేగల్లు, నల్లరేగల్లు దాటితే చేకువనం ఉన్నయ్- పడమట గుట్ట- గుట్ట మీన బిలుగును, కొండిశెలు, పెన్నంగులు, నల్లమద్దులు, నారేపల అడవి ఉన్నదట."
గౌరమ్మ నిప్పుతెచ్చి మామకిచ్చింది- గంగయ్య సుట్టముట్టిచ్చి రెండుదమ్ములు గుంజి రైలింజనులాగా పొగవదిలిండు.

సాంబయ్య చెవులు రిక్కించి వింటండు- చేతులు తుడుసుకుంటచ్చి లచ్చిమి అరుగుబండమీద తీరిపారి కూలబడిపోయింది- పిల్లఊకొడుతున్నది- గౌరమ్మ వెన్నెలను చూస్తోంది....

"మనం దచ్చినాన్నున్న ఏల్లెదిగి- తేటంగ పార్తున్న నీళ్లల్ల మొఖంకడుక్కొని ఒడ్డెక్కితె మద్దిసెల్లకింద గొడ్లపోరగండ్లు ఆటలాడుకుంట కన్పిత్తరు- కడవలు నెత్తులమీన బెట్టుకొని ముచ్చెట్లుబెట్టుకుంట నీళ్లకచ్చె ఆడోళ్లు కన్పిత్తరు ఇంకొంచెం ముంగటికి నడిత్తె తాళ్లు- తాళ్లల్ల మనంబొయ్యేతొవ్వబందుకు తాటికమ్మల గుడిసె- గుడిసెముంగట నురుగులుగక్కే- కల్లులొట్లు- రేకలుబట్టి గుట్కే- గుట్కేన కల్లుదాగే మనుషులు మోకులు భుజాలకేసుకొని ఉరుకులు పరుగులు బెట్టే గౌండ్లోల్లు- గుడిసె ముంగట ఇరిగిన తాటిమాను పక్క- సెనిగల గుడ్డోడు రాందాసుంటడు- ఆడుమెడలు తిప్పుకుంట ఏదో పదంపాడుతుంటడు- మీ అయ్యకైతె గ పాటలింటె సలిజెరమత్తది- సరేపిల్లా గ గుడిసెదాటి కుసంత దూరం నడిత్తె కూలిపోయిన గుడిశెలు- ఆ గుడిశెల్ల కుమ్మరోనిల్లు గన్పిత్తది- ఆడకుమ్మరి పెదలింగయ్య సపుకూ సపుకున కుండలు సరుత్తంటడు- అన్నుంచి కూసంత ముంగటికి నడిత్తె అడ్లోనిల్లు అడ్ల శంభయ్య దెబ్బ దెబ్బకు మూలుక్కుంట పెద్దబాడిసె ఆడిత్తంటడు- శంభయ్య ఇల్లు దాటుతె కమ్మరి రాజయ్య కొలిమి మండుతంటది.... గిట్ల ఇల్లిల్లు దిరుక్కుంటబోతె మూడు పానాదు లత్తయి- ఆడ ఆంజనేయుని గుడి- గుడిదాటుతె గూనిండ్లు గ గూనిండ్ల ముంగట షావుకారి పాపయ్య దుకాన్ల తీరిపారి కూసుండి ఎవన్నో తిడుతాంటడు.

అన్నుంచి సీదానడిసి ఉత్తురంకెళ్ళి తిరుగుతె బజారు పెద్దదయితది- గదాంట్ల కొంతదూరం నడిత్తివో పెద్ద మట్టిగోడ గన్పిత్తది- మట్టిగోడపొంట నడుసుకుంట

527

బోతె ఏనుగలంత బండలతోటి గట్టిన పెద్దరువాజ గన్పడ్తది- పగటీంచయిత్తె గది తెరిసుంటది- నాత్రిబోతె కర్రెగమాగిన తలుపులు గన్పడ్తయి- తెరిసున్నప్పుడు లోపటికి సూత్తివా ? కంటిసూపు అనేంతదూరంల పెద్దబంగుళుంటది- గ బంగుళ ఊరిదొరది.

గట్ల ఇంకాముంగటికిబోతె ఊరవతల ఇసిరేసినట్టున్న కూలిపోయిన గడిసెలు మాదుగులయి- మాదిగోళ్ళ గుడిసెలకు కుడిెయ్యిబాజు మామిడితోట- పెద్దపెద్ద గడ్డాములు- గడ్డాముల ముంగట గుర్రాల సోవడసొంటి కొట్టాలు కన్పడ్తయి- గయిదొర కొట్టాలు- కొట్టాల బందుకు ఒక్క దినమంతా గుర్రంమీన కూకుండి ఎంత దిరుగుతవో గన్ని భూములు దొరయి సెరువెనుక- ఊరుసుట్టు- అన్నీ దొరభూములే- తుమ్మల బీళ్ల దొరయే- ఆటవతలి పేకువనం దొరదే- తుమ్మల బీళ్లల్ల పదిమంది గాసెగొండ్లు, బర్లు మేసుకుంట గన్పడ్తయి.

పిల్ల అపులించింది- గంగయ్య మళ్లీ చుట్ట ముట్టించాడు.

" అవునే పొట్టి కోడలా ! ఊరంటె ఎట్లుంటదో ఎరికయ్యిందా ?"

"కతసెప్పుతనని శాత్రం జెప్పుతన్నవ్.... నాకు మాఎరికే గిదిమీఊరేనాయె-" పిల్లతల్లి దగ్గెరికురికింది.

మిగతాముగ్గురు ఆసక్తిగా వింటున్నారు.

దొరంటెదొరగాదు- పెద్దపులివంత- తలువారుకట్టు మీసాలు కడుముంతలంత చెంపలు- మోకాళ్ళదనుక పేతులు- గొర్లకోళ్ళదిన్న సెత్తాయె- మాదండిసెత్త- అగో గసొంటి దొరపేరు గోపాలురావుదొర.

గోపాల్రావుదొర లేసుడే బారెడు పొద్దెక్కినంక లేత్తడు- లేసిండంటె సాకలి మల్లిగాడు ముంతల నీళ్లబోసుకొని పాయఖానికాడ తయారుగుండాలె. అచ్చిండంటె సాకలిసెంద్రిడు ఏపపుల్ల బట్టుకొని ఆజరుబలుకాలె- సలసలకాగేనీళ్ల డాసెంకటి పట్టుకరావాలె- మంగలి సుబ్బడు కుర్చిదెచ్చేయాలె- గప్పుడు తోలుదీసిచ్చిన ఏప్పుల్ల సుతారంగ నమిలి సలసల మరిగేనీళ్ల ఎంకటి పేతులమీన బోత్తాంటె దొర మొఖం కడుగుతడు- గప్పుడు కాపు అంతమ్మ నవ్వుకుంట మెత్తటి తువ్వాల దేవాలె- గిండ్ల ఏది తక్కువైనా ఎవడు ఎనుకైనా ఆని ఈపు జమిడికె మోత మోగుద్ది....

అగొగట్ల మొకం కడుక్కొని అర్రల కప్పెటాల్లకు కోడిగుడ్డట్టు గరంగరం గుండాలె- గయి సుందరమ్మ పట్టుకరావాలె- ముంగటున్న బల్ల తళతళ మెరువాలె-

గ బల్లమీన గాజుగిలాస బరండి కీసుండాలె- బరండి రెండు పావులేసి ఎనిమిది కోడి గుడ్లట్లు దినేటాల్లకు సుందరమ్మ తువ్వాలందియ్యాలె- సికిలేటు డబ్బ సేతికియ్యాలె- దొర సికిలేటు నోట్లెబెట్టుకుంటె అగ్గిపెట్టెగీకి అంటుబెట్టాలె- గప్పుడు దొర సిట్ట సిమాంట నోరిప్పుతడు సుందరమ్మను తిట్టరానితిట్లు దిట్టి- భయంతోని ముద్దగట్టుక పోయిన సుందరమ్మ బుజాలు పట్టుకొని కుర్సీల నుంచి లేత్తడు.

లేసిబంతుల్లకు నడుత్తడు. ఆడ సుంకరోల్లు, పనిపాటలోల్లు అంగంగి దండాలు బెట్టాలె- మంగలి శాయిమల్లడు తట్టుకుర్సిదుబపాలె- దొర అంతూపొంతూ లేకుంట ఊరుపేరు లేకుంట కసిన్ని తిట్లు తిడుతడు- అంచిన మొకమెత్తకుంట ఇనేకొడికిని "పోండ్లి" అంటె సెప్పిన పనిమీదకురుకాలె- గప్పుడు షెకెదారు రాములచ్చి దండం బెట్టి ఊల్లె ముచ్చెట్లు జెప్పాలె- దొర తిట్లతోనే పాలేరోల్లకు పనులు జెప్పుతడు- షెకె దారెల్లిపోయినంక పట్టెనామాల పానుపండ్ల అయ్యగారు జంజిరవొప్పన తీడుకుంటచ్చి కపేపు దొరను "ఇ దురినివి - సెందురునివి" అనుకుంటనే ఊల్లె ముచ్చట్లు సెప్పి పోతడు- దొర సికిలేటుమీన సికిలేటు అయిదు సికిలేట్లు దాగేటాల్లకు రావాల్సినోల్లచ్చి పోవాలె- అప్పటికి అంబటేల్లయ్యద్ది.

గప్పుడు మంగలి శాయిమల్లడు అరుక్కిందినుంచి అరుగుమీనికెక్కి- అనికే సేతులతోని దొరబనీనిప్పాలె- తళతళమెరిసే ఇత్తడిగిన్నెల సబ్బుసురుగుబెట్టి- ఆడోల్ల సక్కదనంమీన ముచ్చెట్లు బెట్టుకుంట జేగర్తగ గడ్డంగీకాలె- గడ్డంగీకి సలువసేసిన గుడ్డతోని తుడిసి- గిన్నెల కొబ్బరినూనేసుకొని సల్లసెముటలు బెట్టంగ మాలీష్‌జేయాలె మాలీషయిపోయిందంటె పడిబిందెల ఉడుకునీల్లు గంగాళంలబోసుకొని సుందరమ్మ తైనత్‌గుండాలె- దొర తానాలఅర్రలకచ్చినంక సాకలిసెందురడు ఎత్తుపీటెయ్యాలె- పీటమీన కూసుండబెట్టి సుందరమ్మ పరాసికాలాడుకుంట తానం సేపియ్యాలె- సాకలి సెందురడు సలుపధోతి అందియ్యాలె- సుందరమ్మ తువ్వాలతోని ఒల్లుదుడువాలె- గప్పుడుదొర ధోతిగట్టుకొని బంగులెక్కుతడు- బంగుళమీన దేవునర్రల ఆరతిపల్లెం, పట్టుసీరగట్టుకొని దొర్సాని తయారుగుంటది- దొర అరతి కండ్లకద్దుకొని- దేవునికి దండంబెట్టి- మళ్లకిందికిదిగుతడు. బోజినాలర్రల- కోడికూర, చాపలపులుసు: మీగడ పెరుగు ఆసనబియ్యపన్నం, జింకవేపుడు, ఆవునెయ్యిగిట్ల భోజినంబెట్టుకొని దొర్సా నుండాలె- దొర అదింత ఇదింత అంటిముట్టనట్టుదింటడు. దొర్సాని సెయ్యిమీన నీల్లబోత్తాంటె- సెయ్యికడుక్కుంటడు. సుందరమ్మ తువ్వాలందియ్యాలె- పేదెక్కే టాల్లకు బరండికీసుండాలె- బర్రండిదాగినంక గలుమముంగట సెప్పులుండాలె- సెప్పులు తొడుక్కున్నంక సాకలిసెందురడు సేతికి సిమ్మంమూతికట్టెఇయ్యాలె- దొర బంకుల్ల

కచ్చెటాల్లకు సుంకరోడు తయారుగుండాలె- గప్పుడు దొర సైగజేత్తడు. సైగనుబట్టి ఒరుగుడు మెత్తలబండి ఉరికిరావాలె- మొందోడు దొరకు దండంబెట్టి నిలవోవాలె- దొర సికిలేటుముట్టిచ్చి బండెక్కుతడు- మొందోడు అనికేసేతులతోని అరుగట్టై దొర సేతికియ్యాలె- దొర సెప్పులుబట్టుకొని సుంకరోడు ఎనుకునకాలే- దొర చేతుల అరుగట్టై "ఛల్" మంటది కయిలు ముచ్చుకోల్లాగెలు కస్సునఉరుకాలె- అటిముంగట ఎగవోసుకుంట సుంకరోడురుకాలె.

బండి బజాట్ల కచ్చిందంటె- మనుషులెవ్వలుండద్దు- ఉంటే గంటే రుమాల్లు తీక్కొని పబ్బతిబట్టాలె- బండ్లు గిండ్లు ఎదురత్తె బండిపడదునికి పక్కకు బట్టుకోవాలె- ఎవడన్న కానకపోతే అని కర్మము బలిగిందే! బండి అగకుంట ఉరుకుతాంటది- కాలికుండలు, కట్టెలబండి దొర కెదురత్తె తోలుపికులగొట్టుడే- నీల్లకడవలెత్తుకొని అడివోరగండ్లు ఎదురయితె ఎటోల్లటు ఉరుకాల్సిందే దొర నజరుబడ్డదా? గరిమాపటికి ఇంటికి రావల్సిందే- బండి ఊల్లెనుంచి రాంగ- పంచాతులోల్లు, పడావులోల్లు అను మండ్ల గద్దెకాడ కుప్పకూడుండాలె- ఆడ గుడిసేపు బండాగుతది- అడ కూసునోల్లు ఒక్కపారే దండాలు బెడుతరు....పంచాతులోల్లు ఏడ్చుకుంట సంగతేందో చెప్పుకుంటరు.

పంచాతు పెద్దదయితె దొర బండి దిగుతడు- సుంకరోడు కాళ్ల కింద చెప్పు లేత్తడు- కుర్సి పెద్దరయితు మీదివంచెతోని తుడుత్తడు- తిట్లతోని దొర పంచాతు తెంపుతడు- అరుగట్టందుకొని తప్పన్నోన్ని అట్టలుదేలగొడ్తడు- తప్పొప్పులు దొరిట్టమే- దండుగ పైసలు మాలిపటేల్ కీసలబెట్టుకొనిపోయి దొర గుమత్తకియ్యాలే- అన్నుంచి బండి తాళ్లల్లకు నడుత్తది- అడ బండాగుతె గౌండ్ల పెద్దిరాయుడురికత్తడు పెట్ల మామూల్లసంగతి సుంకరోడడుగుతడు.... అన్నుంచి బండి కదిలిందంటె- గొర్ల మంద లెదురయితయి- గొల్ల కొమురయ్య ఉరికత్తడు- సుంకరోడు గొర్రెపిల్లలడుగుతడు- గోల్లోడు పొడేలును మోసుకపోయి ఇంట్లదించిరావాలె- అన్నుంచిబోతె సిల్లర రైతుల కల్లాలత్తయి- బక్కసక్క రైతుల కల్లాలముంగట బండాగుతది- సుంకరోడు బాకీలడుగుతడు- బత్తాలు బండ్లమీన గుమ్ములరత్రిలకు బోవాలె- బండిసెరువు కట్టెక్కుతె నీరటికాళ్లు బండెనుక ఉరికిరావాలె.

గట్ల బండి పేండ్లు పెలుకలు దిరుక్కొని నెత్తిమీనికి పొద్దచ్చెటాల్లకు కొట్టం కాడికి పేరుకుంటరు.

కొట్టంకాడ గప్పుడే ఆంబోతు మెడలిసురుకుంటది.

530

గంగయ్య చెప్పడమాపి సాంబయ్య ముఖంలోకి చూసిండు....లచ్చిమి చెంపకు చెయ్యాన్చుకొని దింటున్నది- గౌరమ్మ వాకిట్లో కూర్చుండి మామ మొఖం వులుకు

పులుకున చూస్తున్నది.... మాఘ వెన్నెల రాత్రిల్లు, చలికాలం నెగడిదగ్గర జనాన్ని కుప్పేసి ఇలాంటి కథలు ఎన్నో చెప్పగా తనూ విన్నది.

గంగయ్య మళ్లీ చెప్పడం సాగించాడు.

అంబోతంటె అంబోతుగాదు- గుండుకొమ్ములు, ఏనుగుపొట్ట కయిలిముచ్చు కొండసొంటి ఊపురం- కాటికెకండ్లు- బొక్కపూసల పంతాడు- ఎడంకాలుకు ఎద్దు నెలితాడు. రోషంబీకుతె రోషంతోని నెత్తురు జిమ్మాలె- సెయ్యెత్తెఅందనికోడె.

ఓపారిదొర సడ్డకునింటికి సుట్టంసూపుబోయిండు- సడ్డకుడు పొలాలు సేండ్లు దిప్పి గొడ్లమందను సూపెట్టిండు. గొడ్లమందల అంబోతును సూసి దొరకండ్లు నిలబడి పోయినయ్- గమందల గసొంటి కోల్లాగెలుశానున్నయి- తనో అంబోతును బెంచా ల్నని దొరకు కాయిష్‌బడ్డది- గముచ్చట షెకెదారు రాములుతోనన్నడు.

"బొనుండ్లి- మన మందల అంబోతులేక అన్న పొట్టిగిత్తలే ఎదుగుతన్నయ్- మనకు నాగండ్లకు గావాల్నంటే ఏలకేలుబెట్టి కొనుడైతంది- మనం అమ్మాల్నంటే గీములక్కాయలకేపత్తది- నామనుసుల ఎప్పటినుంచో అంబోతు గావాల్నని ఉన్నది దొరా" రాములన్నడు.

గప్పుడు దొర మనుషుల తరిమిండు- ఉత్తరంబోయినోడు ఉత్తసేతులచ్చిండు. దచ్చినంబోయినోడు దీలెపడచ్చిండు. తూరుపుబోయినోడు తిరిగి తిరిగి సచ్చిండు. పడుమటికి బొయినోడు పగ్గాన్నిగ్గి అంబోతును నలుగురు మనుషులతోటి పట్టిచ్చు కచ్చిండు- గీ అంబోతును సూసేటందుకు ఊరుఊరంత ఒడ్డన ఒరిగింది- మందిని జూసి అంబోతు సింగిబింగాడింది. పట్టైనామాలయ్యగారు ఆపక్క ఈపక్కజూసి అటెన్క పంచాంగంజూసి తిథి నచ్చెత్రింజూసి అన్ని అవ్వల్దర్జగున్నయన్నడు. జిట్టి తాగిందని మంగలోనితోని జీడిగింజలు తింపిచ్చి అగ్గిలేపిచ్చిండు- అందరెల్లిపోయినంక-

"దొరా! ఈకోడె చూడవోతే శృంగారంగున్నది". అయ్యగారు గుటికిల్లు మింగిండు.

దొర కలవరపడి సూసిండు-

"దీని ఊపురంమీద సుడున్నది".

"ఉంటేందోసెప్పు."

"దీన్ని నాగలికికడితే భూదేవి వలపోస్తది- వర్షాలు ఆగిపోతయ్."

"ధుత్తెరి ఎక్కన్నుంచి దొరికినవయ్యా! గిదీన్ని మందమీదికి తెచ్చిన"

531

"మంచిమాటేకాని దొరవారు.... దీన్ని దేవునిపీటమీద విడిచిపెట్టాలె- వేములవాడ రాజేశ్వరస్వామి కన్ను చాలాబాగున్నది. తమరింట చూస్కోండి లక్ష్మి తాండవ మాడుతది".

దొరకు సమఝ్‌కాలే- అయ్యగారు తెలకప్పిండు. దొర కడుపు కదిలేటట్టుగ నవ్విండు.

అగోగట్ల గీ అంబోతు ఊరుమీనికచ్చింది.

మల్ల గిప్పుడు దొర ఆరుగట్టె సుంకరోనిమీనికిసిరేసిండు- ఎనుకనుంచి సుంకరోడురికచ్చి చెప్పులు కిందేసిండు. దొర బండిపడదునికి సెప్పులు తొడుక్కొని దొడ్లెకు నడిసిండు, రామలచ్చడు కుర్సెత్తుకచ్చి ఏసిండు. దొర కుర్సిమీన కూసుండ కుంటనే అంబోతును ఆపక్కీపక్కసూసి- ఏసన్న మైలంటిందేమోనని తసఖీచేసిండు. కర్మము పలుగనే పలిగింది. కుడిపక్కన జోరీగ ఆలనేఅలింది. దొర పాలేరొల్లను పెండ్లమాలు దిట్టిండు. రామలచ్చడు గజగజ అనికిండు.

దొర కుర్సిమీన కూసుండకుంటనే ఎనుకకు మర్రిండు. మల్ల గజ్జెలకచ్చురం కదిలింది. గడీల గజ్జెలకచ్చురం ఆగెటాల్లకు పొద్దంగుతది. మోటర తయారుబెట్టుకొని డ్రైవరు మొగిలయ్యుంటడు. దొర మోటరెక్కుతడు. మోటర తాలుకాకుబోద్ది. ఇగ అడతాగి తందానలాడి ఏ తెల్లారంగనో మల్లింటికత్తడు.

అప్పటికి నడిఝామురాత్రి తిరిగిపోయింది. గుడ్డెంకడు మూడు బజార్లదగ్గర ఒగ్గుకథ మొదలేసిండు. వానికంఠం అంతకంతకు తీవ్రమైపోతోంది. కథలో పరుశు రాముడు గొడ్డలి భుజానేసుకొని కనిపించినరాజునల్లా నరికి పారేస్తున్నాడు. ఎవడో సుతిపట్టుకుంట మధ్య మధ్య "ఒహో .. ఆఁ.... అహఁ" అంటూ అక్కడక్కడ వచనం చెప్పుతున్నాడు. ఏడ సడీ సప్పుడులేదు. గుడ్డెంకని బొంగురుగొంతు కొంచెం జీరవోయి అదేదో ఏడుపుతీరుగా వినిపిస్తోంది. సాంబయ్యలేచి వాకిట్లోనుండి గుడిసె వెనుకకుపోయి ఎడ్లముంగటి సొప్పదంటు దగ్గరేసి వచ్చిండు. లచ్చిమికొంగు నేలమీద పరుచుకొని ఒరిగిపోయింది. గౌరమ్మ చెల్లెపక్కలో పండుకొన్నది. ఆమె కళ్లముందు మొగుడు కొండయ్యరూపమే కదులుతోంది.

"ఇంటన్నరా ! రాత్రిం పురంగ అయిపోలే" గంగయ్య ఆవులించి అన్నాడు.

సాంబయ్య తలూపిండు. గౌరమ్మ "సెప్పు....సెప్పు" మన్నది. 532

ఇవ్వాళ్దనుక దొరకత సెప్పుకచ్చిన. దొరలసంగతి ఊళ్లె పాల్లకె పోరికాన్నుం చరికే- కని గ అంబోతుసంగతే సెప్పుకోవాలె....

అంబోతు కరకర పొద్దుపొడిసేటాల్లకు లేసినిలబడ్తది. నిలబడేటాల్లకు మాల మదునడు ఇనుపతట్ట బట్టుకచ్చి దానికిందబెడుతడు. తట్టల సిలసిల ఉచ్చబోత్తది. ఎర్రెకండ్ల ఎడ్డిసమ్మడు ఎరకలతట్ట బట్టుకొని నిలుసుంటడు. తట్టల పెండబెడ్తది. రామలచ్చడు ఉరికచ్చి అంబోతుమెడల తలుగిప్పి దొడ్లెనుంచి ఈతలికి బట్టుకత్తడు. ఎండపొడల అంబోతు ఒళ్ళిరుసుకుంటది, మదునడు దాని పక్కఅరిగడ్డి పరుపుదీసి గొడ్లకేత్తడు. రామలచ్చడు, సమ్మడు, కాశెలు బిగగట్టి కసేపు అంబోతుకు మాలీష్ జేత్తరు సల్లసెముటలు బెట్టంగ. సుక్కడు బకిట్ల నీల్లుబట్టుకొని తయారుగుంటడు. ముగ్గురు నీల్లుబోసి, ఒళ్ళుగీకి పెయికడుగుతరు. తల పంచెలూడటీకి మెత్తగ తుడుత్తరు. మదునడు పల్లిపిండి, ఉలువపప్పు కలుపుకత్తడు. మదునడు తట్ట నోటికాడ బట్టుకుంటె అంటి ముట్టనట్టు తింటది. సుక్కడు నీల్లుబెట్టి మూతి తుడుత్తడు. అప్పటికే దొరచ్చి జోదడు. గప్పుడు రామలచ్చడు తలుగు తప్పదీత్తడు. అంబోతు అడుగులడుగేసుకుంట పడారిగోడ దాటి బజాట్లకచ్చి నిలుసుండి పెఢీల్న రంకేత్తది. ఎదురంగ ఏది ఉండదు- ఉంటే కొమ్ములమీనేసుకుంటది.

అంబోతు గట్ల అడుగులడుగేసుకుంట- పక్కసూపులు సూడకుంట ఊరుదిక్కపడుత్తది- ఊల్లె అంబోతు ఈకొసకు జొచ్చిందంటె "అంబోతత్తందన్న అర్త" ఆకొసకు సేరుసుంటది- అది బజాట్ల కచ్చిందంటే బజాట్ల మనుషులు ఎక్కడోల్లక్కడ ఆగిపోవాల్సిందే- బండ్లు ఓరగ్గొట్టుకొని నిలబెట్టుకోవాల్సిందే- అది గన్పడ్డదంటె ఊరోల్లు పబ్బతులు బట్టుకొని కోతిమొక్కులు మొక్కుకుంట నిలబడి అదిపోయినంక కదులుతరు,

గట్ల అంబోతు ఆడఆడలు దిరుగుతది. అక్కన్నుంచి సీదా దచ్చినానికి తిరిగి తుమ్మల బీల్ల దాటుద్ది- తుమ్మల బీళ్లకావల ఎకురా అరెకురం బూములున్న బక్కరైతుల ఆరువాలు దానికండ్లబడ్తయి. తుమ్మల బీల్లెనుంచిసీదా ఎవని పెరట్లనోజొత్తది.

మంచెల మీద పోరగండ్లు లబ్బర లిబ్బర మొత్తుకుంట పీపాలు, రేకుడబ్బాలు కొడుతరు.... రైతులు కాళ్లువనుకంగ ఎటూదోసక ఆగమాగమైపకుతరు.... ఎవడో పడుసోడు కండ్లకు నెత్తురురాంగ ముల్లుగర్రి బట్టుకొని ఉరికత్తడు. అంబోతు నెత్తురు బొట్లోలె నీల్లుగట్టుకొని పెంచిన మక్కగర్రిలు పడుగ్గ పడుగ్గునిరుగంగ పెరట్ల ఉరుకులు పరుగులు బెడ్తది- కొమ్ములతోని సిమ్మతది- పీసుల పీకిపారేత్తది. పడుసోని ముల్లుగర్రి గాలిలకులేత్తది. అనయ్యో పడుకుంట లేసుకుంట ఉరికత్తడు.... సేతుల కట్టె గుంజుకుంటడు.

"రామేశ్వరసామి గంపంత కన్నుపెట్టుకొని ఏడున్నవా బాంచెన్- ఏం మొక్కులు తక్కువ జేసిన బాంచెన్...." ముసలోడు గజగజ వనుక్కుంట మొక్కుతడు.

రామేశ్వరసామి మొర ఇనడు- పెరడిసత్తె నాశిడం పుత్రిపూజ సేసినంక పళ్లో పెరట్లకురుకుతది.

"వారీ! సాంబయ్యా! అంబోతు పెరట్ల సొచ్చిదంటె అని పెరడికి అగ్గిమల్లె దాకినట్టె, అనింటికి అగ్గిదాకినట్టె, అనిఆరువం దొంగలు దోసినట్టె. అంతవరదనుక అదలకుంటచ్చిన అంబోతుకు ఏంబుడుతదోరా! పెరడంతగత్తి తిరిగినట్టు ఉరుకుతది. బొల్లుబొల్లుకాంగ సెంగలిత్తది. పెఢీ పెఢిన లెంకలేత్తది...."

కండ్ల ముంగట ఆరువం సత్తెనాశిడం కాంగ దూరంగ నిలుసుండి సేతుల్లకు రుమాలు దీసుకొని కండ్లపొంట నీల్లు దీసుకుంట వలవల ఏడువాల్సిందే.

ఆరుగాలం కట్టపడి, నోటికాడికచ్చిన పంట సత్తెనాశిడం కాంగ రైతుకుకండ్లకు నెత్తురత్తది. కడుపుల పేగులు నోట్లెకత్తయి. అంబోతును తరిమి గొట్టాల్నంటె రెండుభయాలు ఊరోల్లకు ఒకటేమొ దొర బతుకనియ్యడు.... రెండోది దేవునికి కోపమొత్తది. ఇద్దరికి కోపమచ్చినంక మరింక గీ భూమ్మీన బతకడం కట్టం....

అంబోతు గట్ల ఏష్టచ్చెదనుక సయ్యాటలాడి. ఎసల్లేల్లకు మెల్లెంగ కంచెలకెల్లి బోతది.

కంచెల్ల గొడ్లబోయిలు గజగజ అనుకుతరు. అంబోతు ఎదబడ్తది. అంబోతును జూత్తెనే ఆవులు పెండబెట్టి ఎటుదటు ఉరుకుతది. ఉరుకసాతగానిది తొరికిదంటేసచ్చిందే గట్లకంచెల్ల ఎడ్లగొడ్ల పెదురగొట్టి బారెడు పొద్దున్నదనంగ మల్ల ఊరుసొత్తది.

ఎదురచ్చిన కట్టెల బండ్లు ఆగిపోతయి.... కాండ్ల మీని బక్కోడ్లు గజగజ లాడ్తయి.... ఊల్లె పోరగాండ్లురుకుతరు.... ఇండ్లకు మల్లిన గొడ్లు ఆగమాగమయి తయి.... నీల్లకుబొయినోల్ల కాల్లు తత్తరబడ్తయి.... మునిమాపటేల్ల ఊరును గజగజ లాడిచ్చి గప్పుడు దొడ్డి తోవబడ్తది.... గప్పుడు ఊరు ఊపిరి దీసుకుంటది.

అగో గట్ల దొరకు దొర అంబోతుకు ఎదురు లేకుంట కొన్ని ఏండ్లు గడిసినయి.

గ ఊల్లె దొరతోని, దొర అంబోతుతోని ఎన్ని బతుకులు పెడిపోయినయో లెక్కలేదు.... లచ్చలు లాకులు.

గిది గిట్లుండంగ బతుకు దెరువులేక బొగ్గుబాయిలకు బొయిన లచ్చన్న[illegible]యి దొరలు బాయి లాంగ్ బార్ సేత్తె పుట్టినూరికి పెండ్లాం పిల్లలతోని తరలచ్చిండు. కోటి

అవుతారాలెత్తినా కోండ్రికు మించిందిలేదని గునాంచుకున్నడు. తెల్లంగీలు, సన్నపు ధోతులిడిసి దొడ్డంగీలు, దొడ్డుధోతులు గట్టిండు.

కరువుకు, గత్తరకు, అప్పుకు, సప్పుకు, మంచికి సెడ్డకు ఊడ్సుక పోంగ లచ్చన్న అయ్య ఆశన్న కాకుల గద్దల గొట్టి రెండెకురాల పెరడి దక్కిచ్చిండు. గ దక్కిన పెరట్ల నెత్తురు కలికలి జేసుకొని, మన్నుబుక్కి మన్నేర్గిండు లచ్చన్న-ఊళ్లోల్లందరు "పాపం పోరడు బవుకట్టపోతని" మెచ్చుకున్నరు. అచ్చినేడు లచ్చన్న పెరడు కంకవనమోలె పెరిగిపోయింది. పెరడుజల్లుపీసు మీనుండంగ అంబోతుసొచ్చింది.

ఆశన్న అంబోతు సుట్టు దిరుక్కుంట కోతి దండాలు బెట్టిండు. అంబోతు దండాలు దాపెండ్లు ఖాతరుజెయ్యలే- ఎటూ సాతకాక బాయిగడ్డమీనికెక్కి మొఖాన కొంగుబెట్టుకొని ఏడ్సిండు. ఏడిత్తె కండ్లనీల్లే పోతయని లచ్చన్న ముల్లిగట్టె అందుకొని పెరట్లకురికిండు, అంబోతును అదిలించిండు- అంబోతయితె ఎల్లిపోలేగని సందెలు బడేయేల్లకు దొర దగ్గెర నుంచి పిలుపచ్చింది. పోవన్నా అద్దా అని ఇసారపడేటాల్లకే సుంకరోల్లు గడిలకు గుంజుకపోయిండ్లు- నోరుదెరిసి కట్టం సుకం జెప్పుకుందామనుకునేటాల్లకే నోరు మూసిండ్లు- కండ్లల్ల నెత్తురు జిమ్మేటాల్లకే కట్టేసిండ్లు- కండ్లుమూసి తెరిసేటాల్లకు లచ్చన్న నెత్తురు ముద్దయిపోయిండు. మరి కాసేపటికి బజాట్ల దుబ్బల పడిపోయిండు.

సూసిన ఊరిజనం "చ్చొచ్చొ" అన్నరు కొందరు. "మెడబలిమి" అన్నరు ఊరిపెద్దలు- "పాపమా పచ్చిభూతా" అన్నరు ఆడోల్లు- "కాదు గిది అన్నాయెం" అన్నరు పడుసోల్లు- లచ్చన్న తల్లి భూదేవి కొడుకును లేపుకొని దొర గడిమీన ఇంత మన్నుబోసి ఇంటికి దీసుకపోయింగి. లచ్చన్న పెండ్లం ముత్తమ్మ సప్పుడుకాని ఏడుపు ఏడ్సుకుంట ఉప్పుకాపింది- ఆశన్న కడుపుదేవి గ నాత్రింత సిల్లులు బడ్డ గుడిపెకప్పు సూసుకుంట ఉపాసంపన్నడు. లచ్చన్న కోలుకోను నెల్లాలు బట్టింది. మంచాల నెల్లాలు ఎన్నో ఇసారాలు దోసినయ్. తనొక్కడు ఎదురుతిరిగితే ఏమయితదో తెలిసచ్చింది. మరెట్ల బతకడమో ఎంత ఇసారం జేసినా అంతుసిక్కలే.... మరంద్పేత బతుకాల్నంటె ఎదురుతిరుగక తప్పదు.... అట్లా గుంజాటన పడుకుంట తిరుగంగనే పక్కూల్లల్ల బీదిబిక్కి ఆర్తలు దెలిసినయ్.... బతుకుదెరువు గురించి పక్షాల్లు సెప్పిన సేసిన ముచ్చట్లు సెవులేసుకున్నడు.

ఇగ గప్పటినుంచి లచ్చన్న కాలుకు బట్టకుంట- తిన్నకూడు పెయిన బట్టకుంట ఇల్లిల్లు దిర్గిండు- మోటలు గొట్టేకాడ ముచ్చట్లు బెట్టిండు. నాగండ్లు నడిసేకాడ

ఇసారాలు జేసిండు- కోతలుగోసేకాడ కతలు సెప్పిండు ... ఏడేంది ఏడబడితాడ తిరిగి లచ్చన్న జనంనోట్లె నాలికయ్యిండు.

జనం ఇసారాలు ఒక్కటయినయ్. రోజుకొకని బూమిగద్దలు తన్నుకపోతంటె రోజుకొకని ఈపుమీన అట్టలు దేల్తాంటె- కడుపుకు జాలనోల్లు, తన్నులు గుద్దులు దిన్నోల్లు, దండుగలు, ఎట్టిలు జేసినోల్లు సాటుమాటుకు గుసగుసలాడిండ్లు- మంచెల మీద పదాలు మొదలయినయ్. సెలుకలకాడ పేండ్లకాడ పదాలు జోరయినయి సిటుక్కున సీకటయ్యిందంటె ఊల్లున్న పడుసు పోరగండ్లు గుజాలు వట్టెటోల్లు- దప్పులుగొట్టెటోల్లు, పంచాల పెద్దులు జమిడికెసెటోడు. సాకలి మల్లిగాడు సుతిపట్టెటోడు.... అగ్గిగట్ల రాజు కుంటంది.

గది సూసిన సాడిగొట్టోల్లకు నిప్పుసంగతి ఎరికగాలే- పాటలుపాడ్తె భాగోత మేత్తరు గావచ్చనుకున్నరు ఆడలాడ్తె సిరుతల రామండెమేత్తరు గావచ్చనుకున్నరు.

ఓనాడు....

సాకలి సెందురుగాడు ఏదో ఖ్యాలిలుండి దొరసెత్తిమీన సలసల మసిలే ఉడుకు నీల్లు గుమ్మరిచ్చిండు. దొర పెయిమీన బొగ్గలుబొడిసినయ్- సెందురుగాని ఈపుమీన గుబ్బలు దేలినయ్- గుబ్బలు సూపుకొని సెందురుగాడు అందరి ముంగట ఏడ్సిండు. అక్కడున్నోల్లంత ఏడ్సిండ్లు- ఏంజెయ్యాల్నో ఎవలకు తోసలే- ఏంజెయ్యకుంటనే పది దినాలు గడిసిపోయినయ్.

అంతట్లకే ఆనకాలమచ్చింది- గడియ పుర్సతులేకుంటయిపోయింది.

గంతట్లకే సర్కారోల్ల మోటర్లచ్చి మాదుగులకు ఇండ్ల జాగాలిత్తమన్నరు. దొర ఊరుబందుకున్న ఎంకటి రెండెకురాల పెరడి సూపెట్టిండు- సర్కారోల్లు మల్లచ్చి ఎంకటి లబలబ మొత్తుకోంగ ఇండ్లజాగల పట్టాలు పంచిపెట్టిన మన్నరు.

లచ్చన్న గ నాత్రి అందరిని కుప్పేసి అయిదు నూర్లెకురాల బూమిగల్గినదొర- పరంపోగులు, షికం, కారజ్కిత్తాలు మడ్డికిందేసుకున్నదొర- అగో గ దొర పెరడి ఊరిబందుకు ఇరువైఎకురాలున్నది గదాంట్లనే ఇండ్లుగట్టుకుందాం అన్నడు.

గమాట మంచిమాటగనే దోసింది- నాత్రికినాత్రి దొర పెరట్ల గుడిసెలు లేసినయ్.

536

తెల్లారి దొర సింగిబింగాడి మాదుగుల బిలిపిచ్చి-

"వారీ ! మాదుగులు ఎనుకటినుంచి కట్టానికి, సుఖానికి మిమ్ముల ఆదుకుంటత్తె గీపని జేసిండ్లు బిడ్డా ! మంచిమాటకు ఇయ్యాల్ల గుడిసెలు పీక్కుంటరో లాపోతే...." దొర ఇంట్లకుబోయిండు.

మాదుగులు ఇండ్లుపీకలేదు- నాత్రి గుడిసెలు కాలిపోయినయ్ మాదుగుల మనుసులు మండినయ్.

కరకర పొద్దుపొడిసేటాల్లకు గడిముంగట ఊరిజనం పేరిపోయిండ్లు- ఎవడు మొత్తుకునేది ఆడుమొత్తుకున్నడు- నెత్తిమీదికి పొద్దచ్చేదనుక గడిముంగట కూసున్నరు. బంగుళమీన్నుంచి నూసినదొరకు లచ్చన్న బండెక్కి ఏందోసెప్పడం కనిపిచ్చింది. ఎట్ల కుప్పకూడినజనం అట్లనే ఎల్లిపోయిండ్లు-

ఊరు బయంతోని బిగుసుకపోయింది.

రెండోనాడు కోతకచ్చిన లచ్చన్న మక్కపెరడు దొర గొడ్లమంద ఏర్లులేకుంట పీక్కతిన్నయ్- ఏడుపుల్లనుంచి కోపం పుట్టకముందే పోలీసులచ్చి లచ్చన్నను తాలూకా ఠానాకు పట్టుకపోయిండ్లు- పోలీసోల్లు ఊళ్లెజొచ్చి కనిపిచ్చినోన్నల్ల తన్నిండ్లు పట్టుకపోయేటోల్ల పట్టుకపోయిండ్లు- ఉన్నభూములమ్ముడుబోయినయ్- కడుపుల్ల మంటలు రవులుకున్నయ్-

దొరసంబుర పడీపడకముందే రాజీపోయి రాజచ్చిండు- జేల్లల్లోల్లను ఇడిసిపెట్టిండ్లు. పోయినోల్లు పల్లచ్చేటాల్లకు ఊరు పాడుబడ్డది- ఎవ్వడూ మాట్లాడడు- కండ్లెత్తడు.

"రోగంతిరిగింది లంజకొడుకులకు" అనుకున్నడుదొర కని నిచ్చానికి రోగం ముదిరింది.

ఈపారి ఊళ్లెకు అచ్చేపోయేటోల్లెక్కువయిండ్లు- ఇంతట్లకే అసకాలమచ్చింది.

కయికిల్లకెగబడే కూలోల్లు కూల్లుపెరుగాలన్నరు- నేంబెంచనేపెంచనన్నడుదొర. కూలోల్లు దిగిరాలే- కారణాలుదెలిసినదొర కారాలు మిరాలు నూరిండు- కయికల్లెక్కినయ్- నాట్లేపేటాల్లకు నారుదొయ్యలు పొట్టకచ్చినయ్.

ఈపారి దొర గజ్జెలకచ్చులం అచ్చేటాల్లకు అనుమండ్ల గద్దెకాడ పంచాతులుంటలేవు- అన్నుంచి తాళ్లల్లకచ్చేటాల్లకు తాళ్ళను గౌండ్లోలసంఘమే హరాజ్జిపాడింది- సెట్లమామూల్లు బందయినయ్- గొల్లోల్లసంఘం అంతుపిల్లలు, ఎట్టిమందలు బంద్ జేసింది- జంగలాతు మామూల్లు బందయిపోయినయ్.

537

గియ్యన్నేంది దొరపని కుడిదిలబడ్డ ఎలుక సద్దమయ్యింది- దొర జేసేపనుఖ దొరజేత్త నేడున్నడు- పోలీసోల్లు "ఊఁ" అంటె ఉరికత్త నేడున్నరు- రోజుకొకన్ని పట్టుకపోతండ్లు- ఎవలో జమానతుబడి ఇడిపిచ్చుకత్తండ్లు- ఊరుఊరంత ఒక్కటయితె- దొరపట్టు పోలీసోల్లయ్యిండ్లు- తన్నులు గుద్దులతోని జనం అంగిపోతరను కుంటె అంతకంతకు రెచ్చిపోయిండ్లు-

రెచ్చిపోయినజనం దొర కబ్జాసేసుకున్న అడివి గొట్టుకున్నరు- కప్పులాలు కదులకముందే జంగలాతోల్లు, పోలీసోల్లు కదిలచ్చిండ్లు- కట్టెలకు తుపాకులకు కసేపు ఇజ్జంజర్గింది. కట్టెలిరిగిపోయినయ్ బండ్లు జంగలాతు అమీనింటికి బోయినయ్.

గిది గిట్లుండంగ మాలిపటేలోడు పంగలి అంకూశవ్వను గుంజిండు. దిక్కులేరనుకున్న అంకూశవ్వకు మాలిపటేలోడు కండ్లు మూసిదెరిసెటాల్లకు సుట్టూర మంది గిరేసుకున్నరు. మామిండ్లల్ల మాలిపటేలోని పుత్తుకునుడు మాయమయ్యింది. మాపటేల్లకచ్చిన పోలీసోల్లకు మామిడితోట్ల ఎర్రిమట్టి సుత దొరకలేదు. నాత్రి బరండికీసలు దాగి ఇసారాలుజేసి కేసులు రాసిండ్లు- అచ్చన్నను మల్ల జీబెక్కిచ్చుకపోయిండ్లు-

మక్కంకు లిరిసిండని మాదిగిపీరన్ని దొర నెత్తురు కక్కంగ గొట్టిండు- కుప్పకూడిన జనం మక్కపెరడుగే ఎసరుబెట్టిండ్లు- ఊల్లోలందరిని దొమ్మి కేసులిరికిచ్చిండు దొర....

గప్పుడు ఊల్లోలందరు దొర పనులు బందుజేసిండ్లు-

ఏరుట కచ్చిన పెసరు గుడ్డాలు పలపల పలిగి బూమిల గల్సినయ్- దొడ్లల్ల గొడ్లు దొడ్లల్లనే పెండలు బెట్టినయ్- దొర లేసేటాల్లకు సాకలి పెందురడు పండ్ల పుల్లియలే- దొర పట్నమురికిండు- పోలీసోల్లు గొడ్లిడిసి కాయరాక దొరను మనుసుల తిట్టిండ్లు- సుందరమ్మ రాక దొర్సాని పేతులు పొక్కులచ్చినయ్,

ఆరందినాలు గడిపెటాల్లకు దొర గడంత పాడుబడిపోయింది. దొరకు గడ్డం బెరిగింది. పోలీసోల్లు సాకలోన్ని దొరికిత్తుకున్నరు. ఆడు పానంబొయినా సంఘాన్నిడువ నన్నడు.

ఊరుగడిమీనికచ్చింది. సాకలి మల్లిగాన్ని ఇడిపిచ్చుకున్నది.

దొరకు బుగులు జొచ్చింది. ఎనుకాముంగట ఇసారం జేత్తె ఎటుసూసిన ఏడే మానుకలున్నది. పోలీసోల్లు పీక్కతింటండ్లు- పనులోల్లురాక గడిమురిగిపోద్ది-

538

కూడుకుమ్మ లేక తాపంత మురిగిపోతరు. మాలిపటేల్‌కు బట్టిన గతి తనకు బడితే.

గిట్ల ఇసారం జేసుకొని పెండ్లాంపిల్లల ఎంటేసుకొని బతికుంటె బరండన్న తాగచ్చునని పట్నానికెల్లిపోయిండు- గడితలుపులు మూసుకున్నయ్- గడికి తాళంకప్పబడ్డది.

"గడంతెరికేగని గ అంబోతు సంగతి జెప్పు...." సాంబయ్య.

"అత్తన్నరా! గాడికే అత్తన్న...." గంగయ్య ఇత్తడి సెంబులనీళ్ల గటగట తాగిండు.

మనుషులు బతుకుదెరువు లేకపోతె దేశాలు దెగిచ్చుకపోతరు. దొరకు పైక మున్నది- పట్నంల బతుకపోయిండు మరి పసురం గ అంబోతేడబోద్ది....?

అంబోతు లేసెటాల్లకు ఉచ్చబట్టెటోడులేడు. పెండదీసెటోడు లేడు. మాలీషు జేసెటోడులేడు. పల్లిపిండి బెట్టెటోడులేడు- నీల్లు మూతికాడ బట్టెటోడులేడు. పెయి కడిగెటోడులేడు....

అంబోతు పెండదొక్కి- పెండలబన్నది. సలువగుడ్డసొంటి దానిపెయ్యి దుబ్బ, రొచ్చు పెండంటి వికారమైపోయింది. గోమార్లు పెయ్యంత బట్టినయ్- మూడోనాడు ఆకలికాగలేక తలుగుదెంపుకొని దొడ్డెనుక పనుగడి ఇరుగ దొక్కి- ఊతలకచ్చింది. కడుపుల సురసుర కాల్తంది. దానికి నిలుసుండి నీల్లుదాగటం, నిలుసుండి మేయటం తప్ప అంగితినుదెర్కలే-

ఎర్రిలేసిన దానితీర్గ బజార్ల పొంట ఉరికింది.... ఊల్లె దిరుగంగ గదాన్నిసూసి ఎవడూ కోతి దండంబెడ్తలేడు- ఎవడు ఆగిపోవుటం లేదు. గియ్యేమి సూడకుండ తుమ్మల బీడుదాటి రైతుల పెరండ్లమీన పడ్డది. ఒక్క బుక్క అందుకున్నదో లేదో? బాణపుల్లతీర్గ ఒకడురికచ్చి పడెల్లున పంతమీన కొట్టిండు- కండ్లు పులపొడిసేటాల్లకే పెడీపెడిన దెబ్బలు, పోరగండ్లు మట్టిపెళ్లల అర్షం గురిపిచ్చిండ్లు- ముసలోల్లు అనెకెల్ల ముల్లుకట్టెలతోని పొడిసిండ్లు- తిట్లు- దెబ్బలు- కోపంతోని బుసకొట్టబోయిన అంబోతు పెయ్యంత ముల్లుగుచ్చ సందులేకుంట సిదుగబొడిసిండ్లు- ఎటూ సాతకాక ఆరువంల నుంచి గెట్టుమీని ఉరికింది...., కట్టెలు బట్టుకోని రైతులు దానెంట బడ్డరు.

గెట్టుమీన నిలుసుండి అంబోతు కసేపు ఇసారంజేసింది- పసురానికి గిది సమఝ్కాలే- పబ్బతిబట్టిమొక్కే రైతులకేంబుట్టిందో? అన్నంచి ఇంకోసేను- ఇంకోసేండ్ల ఇంకిన్ని దెబ్బలు.

539

మాపటేల్లదనుక ఎర్రిలేసిన కుక్కోలెదిరిగింది– దానిశెయ్యంత పచ్చిపుండయి పోయింది... వసికేకాళ్లతోటి పశురాలు ఇండ్లకు పేరేయేల్లకు ఊళ్లెసొచ్చింది– పసురాలు అంబోతును ఖాతరుజేయలే– ముసలావులు రాక్కుంటబోయినయ్– పొట్టగిత్తలు పెడిపెడిన రెంకలేసి గెదిమినయ్– ఆ పోరగండ్లు తోకపట్టిబట్టి కొట్టిండ్లు– అటుదికి ఇటురికి దాని లంగులుదెగినయ్– సందెలుబడేపేల్లకు గడిముంగటికి జేరుకున్నది.

గిట్ల నెలదినాలు అంబోతు అడుగొట్టపీడు గొట్టకిర్రింది. డొక్కలు బొక్కల కంటినయ్– తోకమట్టకాడ గండిబడ్డది. దెబ్బలు పుండ్లయినయ్– పుండ్లమీన ఈవులు బెట్టినయ్– గిప్పుడు అంబోతు దొబ్బుతె పదిజాగల్ల పడేటట్టుగయిపోయింది.

నెలదినాలబట్టి ఊరెందుకు మారిపోయిందో? గడికెందుకు తాళంబడ్డదో దానికి ఎరికగాలే పసురంగన్క.

ఆఖరుకు ఓనాటి అంబటాల్లకు తిరిగి తిరిగి బేజారైపోయి అనికేకాళ్ళతోని గడిముంగటికచ్చింది– మోరెత్తి గడిని పులుకు పులుకున జూసింది– పటపట కండ్ల బొంట నీళ్లగారంగ గడిసుట్టు గత్తిదిరిగింది. అఖరుకు మరింక కదులరాక గడిముంగటి కచ్చి వారీ! సాంబయ్య! గజగజ అనుక్కుంట– సిలసిల ఉచ్చబోసి పెండబెట్టి దబెల్లున భూమ్మీన కూలబడిపోయి– గిలగిల తన్నుకుంట– "అంబా" "అంబా" అని ఒర్లికుంట జానెడు నాలికెల్లబెట్టి పానమిడిసింది– వారీ సాంబడూ! ఎందుకునచ్చిందో ఎరికయ్యిందా? అంబోతుకు ఊరిసంగతి ఎరికయ్యిందన్నమాట" గంగయ్య దీర్ఘంగా నిట్టూర్చి చప్పున నోరుమూసుకొని మౌనంగా ఉండిపోయాడు. అప్పటికి ఊళ్లె కోళ్లు గూసినయ్– వెన్నెల పడమటివేపు ముఖంమాడ్చుకున్నది. సింతచెట్లనీడలు తూరుపు వేపు పెరిగిపోయినయి– తెల్లారేచుక్క తూరుపుదిక్కున జిగేల్ జిగేల్మని మెరుస్తోంది.

గంగయ్య తుపుక్కున ఊంచాడు.

సాంబయ్య మంచంలో లేచి కూర్చున్నాడు– అతనిశరీరం ఎందుకో దేవుడు పూనిన విధంగా వనుకుతోంది– కండ్లల్లో గుబగుబ నీళ్ళూరినయ్– ఆ గుడ్డివెన్నెలలో గంగయ్య ముఖం తేరిపారి చూశాడు– నిద్రలేని గంగయ్యకండ్లు కమ్మరికొలిమి లోలె మండుతున్నాయి– మంచంలో కూర్చున్న గంగయ్య గుడిమెట్టుతీరుగా కనిపించాడు

ఎలుగురాసిన గొంతికతో గంగయ్య ఇట్లా చెప్పుకొచ్చాడు–

"వారీ! సాంబడూ! కాలంమారుతంది– మనుషులు మార్తున్నరు. బాంచెగాడు తనబతుకు గురించి తెలుసుకున్నడు– బాంచెగాళ్ళంతా సంఘ మయితండ్లు– నల్లని రేగళ్ల బలుకదున్ని పుట్లకొద్ది ధాన్నెంపండిచ్చి లోకాన్ని సాదుకచ్చె బాంచెగాడు,

540

గుట్టలు పలుగ్గొట్టి బంగుళాలుగట్టిన బాంచెగాడు- ఇనుము, ఇత్తడిజేసిన బాంచెగాడు- అగో గసొంటి బాంచెగాడు అట్టలుగట్టినసేతులు కొడవండ్లు, గొడ్డండ్లుజేసి మర్రేసిండు- వారీ! సాంబయ్యా కొలిమిరవులుకున్నది. సెముటమండుతంది. ఇగ సూసుకోరా బాంచెగాళ్ళదెబ్బ! గిప్పుడుసూసో్క! గది అంటోతుత్తీర్గ ఎరుకసేసుకోవో? పసురంతీర్గ కానకుంటివో గది నీతప్పు.... గిన్నేండ్లు పన నెత్తిమీనికెక్కి- సవారిజేసిన దొరల కేగతి పట్టనున్నదో ఇచారంజేయి.... సాంబయ్యా! నాకొడుకును ఎనకకు బొమ్మన్ననో ముంగటికి నడువుమన్ననో నువ్వే సెప్పు.... మనమే అని తొవ్వల నడువనో్న! నువ్వే సెప్పు...." గంగయ్య కంఠంలో కొంచెం తీవ్రత తగ్గింది.

"నాకొడుకు మొదటోడె కాదన- నాకొడుకు గ నిప్పులగుండల నుంచి మీదికి తేలత్తడని సంబురపడ్తలేను.... ఆడుగడాంట్ల మలిగిపోయిన నేను ఏడ్వ! ఏడ్వే ఒందుకేమున్నది? గౌరవ్వా! బిడ్డా! నాకో మనుమన్నియ్యితల్లీ! నాకొడుకు జండెత్తుకొని ముంగటికి నడిసే మనుమన్నియ్యి.... నాతల్లీ!" ఎందుకో గంగయ్య కంఠం ముద్దముద్దగా రాసాగింది.

గౌరమ్మ లేచివచ్చి మామ నోరు మూసింది.

సాంబయ్య అమాంతం లేచి గంగయ్య కాళ్లమీద పడిపోయిండు గంగయ్య పాదాలమీద వెచ్చటి కన్నీళ్లు-

గంగయ్య మరేమి మాట్లాడలేదు సాంబయ్యను లేపి కూర్చుండబెట్టాడు.

"పసురాన్ని బావా! పసురాన్ని" సాంబయ్య గొనుగుతూనే ఉన్నాడు.

"గౌరవ్వా పోదాంనడు బిడ్డా! తెల్లారింది." గంగయ్య ధుమాలుచుట్టుకున్నడు.

లచ్చిమి ఇంకా వెక్కుతోంది.

గౌరమ్మ చీరె మూట పట్టుకొని తయారయ్యింది- లచ్చిమి బిడ్డను దగ్గరగా కౌగలించుకొని ఏడ్చింది. కుంకుం భరిణెదెచ్చి ఎర్రి కుంకుంబొట్టు బిడ్డనుదట బెట్టింది.

గంగయ్య లేచి నిలుచున్నాడు. పుంజికోడి కూసింది.

గంగయ్య గుడుపకర్రికు కోడలు బట్టలమూట తగిలిచ్చు కున్నాడు. మామ ముంగట కోడలు వెనుక తూరుపురేకలు బారుతుండగా తూరుపువేపునడిచారు....

సాంబయ్య లచ్చిమి కరకర పొద్దుపొడిసేదాకా బీరిపోయి చూసుకుంటూ నిలబడిపోయారు........

దారిపొడుగున కోడలుకు మరిన్ని కథలు చెప్పుతూనే ఉన్నాడు రైతుకూలిసంఘ అధ్యక్షుడు గంగయ్య....

541